# అలవాటు పోగొట్టిన ఉపాయం

శారదకు అంత సినీమా పిచ్చివున్నట్లుగా, నరసింహారావుకు ఆమె కాపురానికొచ్చేదాకా తెలియదు; ఉద్యోగంలో ప్రవేశించి కొత్త కాపురం, యేర్పాటుచేసుకొన్న తర్వాత తన వుద్దేశాన్ని ఆమె వెడలగ్రక్కడమే కాకుండా, విజృంభించింది కూడాను.

తాను పుట్టింటవున్నప్పుడు, ప్రతి సినీమా జూసేదాననంది. అదొక పెద్ద పట్టణం కాబట్టి, శారదా వాళ్ళ నాన్న చిన్న జమీందారంతటివాడవటంవల్లా, యితరత్రా యింటి పనులు వగైరా ఆమె జూసుకోవలసిన అవసరంలేకపోవటంవల్ల, కేవలం కాలక్షేపంకోసం — సినీమాకు — వచ్చే ప్రతీదానికీ వెళ్ళడంలో సబబున్నదనుకొన్నాడు నరసింహారావు.

కాని, కాపురానికి రావటంతోటే, శారద రెండు మాసాలకాలం తన మామగారి యింటనే వుంది. ఆరెండు మాసాలూ యేలా వుండకలిగిందో యేమోగాని, నరసింహారావు వుద్యోగమవటం, జాయినయి కాపరం పెట్టడం — ఇంతటితో అభివృద్ధి పొందింది.

మొదటి రోజుల్లో : ఏమండీ సినీమాకు తీసుకువెళ్ళరూ—నరసింహారావు యేమంటాడోననే భయంతో బెదురుజూపుల్తో అడిగింది.

కొండమీద కోతిని దించటంకాదు గదా అని తాను 'సరే' నన్నాడు. 'ఆ సరే' ఒకటి రెండు మార్లతో వదల్లేదు. కాపురానికొచ్చిన రెండు మాసాల్లోనూ పద్దెనిమిది మార్లకు తక్కువకాకుండా జరిగింది.

గుమస్తా వుద్యోగంలో ప్రవేశించి నెలకు అరవైయేడు రూపాయలజీతంతో అఘోరించే నరసింహారావుకు సినీమాకు దంపతీయుక్తంగా వెళ్ళటం, వెళ్ళినప్పుడల్లా రెండు రూపాయలు 'స్వాహా' అవడం బాధగానేవుంది. అయితే యింటివద్దనుంచి కొత్తదంపతులేలా అఘోరిస్తున్నారో అనే వుద్దేశంతో ఏభైరూపాయలు ప్రతీ నెలా వస్తూండటంవల్ల, అదో పెద్ద యిబ్బందిగా కన్పించలేదు.

శారదకు మాత్రం, రోజుమీద రోజు వస్తున్న కొద్దీ పిచ్చి యెక్కువయింది. అది యేవిధమైన పరిస్థితికి దారితీస్తుందోనన్న భయం నరసింహారావుకు కల్గింది.

అందుకని, ఆమె వొకప్పుడు—కోరటంతోటే సుముఖత్వం, యెప్పటి విధంగా ప్రదర్శించకుండా—నరసింహారావు అస్తు పలికాడు.

**శ్రీ ఓగేటి శివరామ కృష్ణ**

ఆలా ప్రతీ సినీమాకు వెళ్ళడం—గౌరవ కుటుంబాల్లో బ్రతికే మనబోటి వాళ్లకు మంచిది కాదన్నాడు.

అంతే—బొటబొట కన్నీళ్లు కారి నేల పడ్డాయి. నరసింహారావుకు సహితం కళ్ళనీళ్ళు వచ్చాయి. అతడి హృదయం, ప్రేమతోను, అభిమానంతోను, జాలితోనూ నిండిపోయింది :

'పిచ్చిదానా! నీ యిష్టప్రకారమే వెడదామే!'—అని తగ్గిపోయాడు...

శారద... కోరికకు మరి ఆటంకంలేకపోయింది! ఎటువంటి లోటుపాట్లూ గృహకృత్యాల్లో జూపకుండా నరసింహారావు కానందం కల్గించేది; సాయంకాలం అయిదు గంటలవటం, తర్వాయిగా, చక్కగా అలంకరించుకొని తెల్లచీరతో, తల్లోపువ్వులతో, గుమ్మంలో నిలబడి, నరసింహారావుకోసం యెదురుజూసేది... ఆ వేళ గనక, తెరమీద బొమ్మ మారినట్లయితే, నరసింహారావు ఖర్మకాలి, పెందరాళే యింటికి వచ్చినట్లయితే:—'ఏమండీ ఈవేళ సినీమా మారింది! చాలా బాగుంటుంది' అని యెదురు సన్నాహం చేసేది.

ఉస్సురనుకొంటూ 'సరే'—అనేవాడు నరసింహారావు... ఒకవేళ అనుకొన్నట్లుగా భర్త వేళకు రానట్లయితే—చాలా దూరం వూహించేది:—'నన్ను సినీమాకు తీసుకెళ్ళటం యిష్టంలేక ఈ విధంగా ఆలస్యంగా వచ్చారు'—అని కళ్ళనీళ్ళు పెట్టుకొనేది!

ఆమె అన్న మాటలో సత్యం వుండటంవల్ల నరసింహారావు యెదురు జవాబు చెప్పలేకపోయేవాడు; కాని 'పోనీ రేపు వెడదాం!'—అని వూరడింపచేసేవాడు!

నరసింహారావు కిష్టంలేకపోయినా, ఆరేపు వెళ్ళటం తప్పని సరి అయ్యేది!

నరసింహారావుకు భార్యమీద సంపూర్ణమైన జాలి యెప్పుడూవుండేది; అందరి భార్యల్లాగ, తన భార్య వేషభాషలకు సరుకులు కావాలనిగాని, చిరుతిండి సామాను తెచ్చిపెట్టమని, నగలు చేయించి పెట్టమని కోరదు! పాపం అదెప్పుడూ కోరేది—సినీమాలు... నరసింహారావుకు సినీమాలకు వెళ్ళటంవల్ల డబ్బు ఖర్చు అన్యధా అవుతున్నందుకు ప్రారంభంలో బాధపడినా, తర్వాత ఆబాధ నెమ్మదిగా తగ్గింది. దానికి బదులుగా ప్రవేశించిన బాధ—ఆరోగ్యభంగం దంపతులకు కలుగుతుందేమో నన్న భయం!

క్రమంగా నెలకు పదిహేను మార్లదాకా—సినీమాకు వెళ్ళటం జరుగుతోంది... నరసింహారావుకు విసుగు జనించింది... ఆరోగ్యం పాడవుతోందేమోనన్న భయంగూడా అతని కంపరించింది... అందువల్ల యెవరి కర్మకు వాళ్లే కర్తలనే

# ★ అలవాటుపోగొట్టిన మందు ★

తలంపుతో భార్య సినీమాలకు వెళ్ళినా, తాను స్వస్తివాచకం పలుకుదామనుకొన్నాడు.

ఆమె కోరటం తడవుగా! 'ఊ వెళ్లు'—అన్నాడొకమారు

'మరి మీరు'—

'నే రాను'—

'అయితే నే వెళ్ళటం మీకిష్టం లేదన్నమాట!'

'వెళ్ళమన్నానుగా!'

'నేవెళ్ళటం మానను; మీరు రాకపోతే నేవెళ్ళను'—

అమాయకంగా నరసింహారావు కళ్ళల్లోకి జూసింది శారద!

నరసింహారావుకి నవ్వువచ్చింది! నవ్వాడతను!

శారద కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి. 'పోనీ లెండి!'

తిరిగి నరసింహారావు లొంగిపోయాడు; అతడి యీ ప్రయత్నంగూడా ఫేలయింది...

రోజులు గడుస్తున్నాయల్లాగే.

నరసింహారావు కిదొక పెద్ద సమస్యయి కూర్చుంది. శారద మనస్సు బాధపడితే తన మనస్సు బాధపడుతుంది; ఆమె ఆనందంగా వుంటే తనకానందం కల్గుతుంది... ఆడదానికి లొంగిపోయిన మగవాడయ్యాడు తను; నయానగాని భయానగాని చెప్పి, శారద దృష్టిని, సినీమాలకు వెళ్ళటంనుంచి మళ్ళించటం దుర్లభం. మరి మార్గం...

కొత్తగా మాష్టరీ వుద్యోగంలో ప్రవేశించిన స్నేహితుడు, నరసింహారావుకు తారసిల్లి, సంగతులు తెలుసుకు సలహాయిచ్చాడు...అతిగా యేపనైనా చేస్తే... దానిమీద విసుగుదల తప్పక యేర్పడుతుందని—దాన్ని సైకాలజీ అంటారనీ.

'అంటే'—విడమర్చి అడిగాడు నరసింహారావు...

'అంటే—నీకు గారెలు తినాలనే కోర్కె వున్నదనుకో! ఒకటి, రెండు చూసి, జూసి తింటే నీకోర్కె యింకా పెరుగుతూనే వుంటుంది; గారెలమీద ఆపేక్ష హెచ్చుతూనే వుంటుంది. అలా కాకుండా... ఒక గారెపళ్లెం దగ్గరవుంచుక, డోకువచ్చే పర్యంతం తిన్నపక్షంలో, వాటిమీద ద్వేషం కల్గటమే కాకుండా...మరి బ్రతికి వుండగా వాటిమీద అభిరుచి జూపించవ్!'—అని విడమర్చి చెప్పాడు పంతులు స్నేహితుడు నిష్క్రమిస్తూ.

'భేష్'—అన్నాడు నరసింహారావు—

* * *

పంతులు స్నేహితుడిచ్చిన సలహాను ఆచరణలో పెట్టటంకోసం, నరసింహారావు భార్యకంటే తానే ముందుగా సినీమాకు బయలుదేరటం మొదలెట్టాడు.

శారద లోగుట్టు గ్రహించలేదు గాని—భర్త తనకంటె ముందు పరుగెడుతున్నందుకు యెంతో ఆనందించింది!

మొదటి ఆట సినీమాకంటె, రెండో ఆట సినీమాకు వెళ్ళటం మూలకంగా ఫలితం, త్వరగా కన్పిస్తుందనుకొన్నాడు పిచ్చి నరసింహారావు...

అలా ఒక వారంరోజులు క్రమం తప్పకుండా వెళ్లేసరికి, నరసింహారావు ఆరోగ్య పరిస్థితులు తారుమారయ్యాయి...రాత్రి రెండో ఆట సినీమా మూలకంగా, బద్ధకంవల్ల ఆఫీసు వ్యవహారాలో ఆలస్యం జరుగుతూండటం, అధికార్ల ఆగ్రహానికి గురవటంగూడా జరిగింది...

పాపం నరసింహారావు పరిస్థితి అలా తయారైంది! శారదకేం—మహారాణీలాగ—నరసింహారావు ఆఫీసుకు బయలుదేరటం తర్వాయిగా, యిదివరకు చేసే పెత్తనాలు తగ్గించుకొని, గుట్టు పెట్టి, నాలుగున్నర, సాయంకాలం అయేదాకా నిద్రపోతూంది; బద్ధకంగూడా అందువల్ల ఆమెలో కన్పించటం లేదు; సొమ్ము పోవటం, ఆరోగ్యంపాడవటం పైగా పై ఆఫీసర్ల చివాట్లు తినటం, భార్యకు లొంగిపోవటంవల్ల నరసింహారావు వంతయ్యాయి!

మాష్టరు స్నేహితుడి సలహాగూడా ఫేలవటంతో, నరసింహారావుబుర్ర దిమ్మెక్కింది; ఆఫీసరు ఆగ్రహానికి, అనుగ్రహం సంపాదించిన తోటి గుమస్తా విశ్వనాథం, నరసింహారావు కథంతా విని నవ్వుతూ: 'మరి సినీమాకు బయల్దేరటానికి వీల్లేదని కూక లెయ్యలేవూ?'—అడిగాడు!

'నీకేం తెలుస్తుంది మిత్రమా! అది కళ్ళనీళ్ళు పెట్టుకొంటూంటే అంతకు ముందెంత కర్కశంగావున్నా నా హృదయం, కరిగిపోతుంది... ఇంకేంచేసేది...' అన్నాడు నరసింహారావు 'సరే—అయితే నే చెప్పినట్లు చెయ్యి—నేనెరిగిన డాక్టరొకాయన వున్నాడు; రెండు రోజులు ఆఫీసుకుగూడా...సెలవుపడెయ్యి'—అని చెవిలో యేమో చెప్పాడు మిత్రుడు విశ్వనాథం...




రమ్యమైన
శిరోజాలు ముఖవర్చస్సుని
ఇనుమడింపజేస్తాయి. ఇందుకు

## కేశవర్ధని

ఉపయోగించి
శిరోజ సౌందర్యాన్ని
పెంపొందించుకోనండి.



కేశవర్ధని అ. 14; షాంపూ అ. 14, అందరు డీలర్లవద్ద లభిస్తాయి.
లేక సౌత్ ఇండియా కెమికల్స్, కాస్ కట్ రోడ్డు, కోయంబుత్తూరుకు వ్రాయండి.

'సరే అలాగే!'—అన్నాడు నరసింహారావు...

* * *

ఆ సాయంకాలం, కళ్ళు మంటలంటూ యింటికి వచ్చాడు నరసింహారావు; శారద తెల్లబోయింది; ప్రక్కింటినుంచి, చనుబాలు తెచ్చి...యేమేమో పాపం అమాయకంగా...చికిత్సలు చేసింది.

కాని మర్నాటి ప్రొద్దుట, నరసింహారావు ఆఫీసుకు సెలవుచీటీ రెండు రోజులకు పంపటంతో ఖంగారు పడిపోయింది...శారద!

'ఏమండీ ఏమిటండీ ...'— అమాయకంగా అడిగింది శారద!

'కళ్ళు మంటలు!—సరిగా యేమీ కన్పట్టంలేదు...'

'మనవాళ్ళకు కబురుచేద్దాం—నాకేదో భయంగావుంది!'—అంది శారద!

'ఏం భయంలేదు. అదే తగ్గుతుంది! వేడివల్ల'—నన్నాడు...నరసింహారావు...

'ఇంతలో విశ్వనాథం వస్తూ:' ఏమోయ్! ఏమిటని' అడిగాడు — శారద, గుమ్మంపక్కగా నక్కి నిల్చుంది.

'కళ్ళు మంటలు ... ఏమీ కన్పట్టంలేదు!'

'అయిందీ! నే అనుకొంటూనే వున్నా! గుమస్తావుద్యోగంచేస్తూ, ఒకమూల చస్తూంటే, ప్రతీ నిత్యం సినిమాలేమిటి? ఈలా సినీమాలు చూస్తే కళ్ళుగూడా పోవచ్చు...' అంటూ గుమ్మంవయిపు చూశాడు విశ్వనాథం!

'అమ్మో కళ్ళే!'—శారద హటాత్తుగా అంది!

'భయంలేదు ... డాక్టర్ని తీసుకువస్తానంటూ ...' విశ్వనాథం బయటకు వెళ్ళాడు!

'మాయదారి సినీమా లింతపని చేస్తాయనుకోలేదు!'—అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది శారద!

'ఏడవకు! ఏం భయంలేదులే!'—అన్నాడు నవ్వు సాపుకొంటూ నరసింహారావు...

డాక్టరు వచ్చాడు...ఏమిటో పరీక్షచేసి 'ఇంక యీలా సినీమాలకు వెళ్ళేపక్షంలో కళ్ళుపోవటం ఖాయం ... దానికి, నెలకొకటి రెండుమార్లని హద్దుండాలి! ఆయనకంత సినీమా పిచ్చివున్నా, మీ రాయన్ని వెళ్ళనివ్వకుండా చెయ్యాలి తెలిసిందా!'—అన్నాడు శారదవైపు చూసి డాక్టరు!

'అలాగేనండి! మరి సినీమాకు వెళ్ళనివ్వను!'—అంది బిక్కమొఖం పెట్టి శారద!

'పదిహేను రోజుల కొకమారు వెళ్ళినా తంటాలేదు...' కాని యీలా వెళ్ళటంవల్ల...ప్రమాదంతప్పదు... మరేం భయంలేదులెండి!'—అన్నాడు డాక్టరు, నరసింహారావు కంట్లో యేదో మందు వేస్తూ...

'మందు... వ ...'— నరసింహారావు యేమో అనబోతూంటే, విశ్వనాథం ... 'భయంలేదు ... నీళ్ళులాగ చల్లగా వుంటుంది!'— కన్ను మూసుకు పోయించుకు పక్కకు వత్తిగిలు చల్లాగావుంటుంది ...అన్నాడు...

నరసింహారావు అలా చేశాడు...

'చల్లగా వుందికాదూ?' విశ్వనాథం ప్రశ్నించాడు.

'ఊఁ...'—అన్నాడు నరసింహారావు.

'ఈమందు చాలుగా డాక్టరుగారూ'

'ఊఁ...ప్రస్తుతానికేం భయంలేదు... మరి సినిమాల కాలా వెళ్ళేమాత్రం, కళ్ళుపోవటం ఖాయం. పోయిన కళ్ళు మళ్ళీరావు' — అన్నాడు డాక్టరు నవ్వుతూ!

శారద గుమ్మందగ్గర నిల్చుండి, చేతులు నలుపుకొంది...

నవ్వుతూ వస్తానంటూ, డాక్టరు వెళ్ళిపోయాడు...

'మళ్ళీ సినీమాకు బయలుదేరు'—అంటూ నీళ్ళమల్లేవుండే మందుసీసా అక్కడుంచి, ఆఫీసుకెళ్ళాడు విశ్వనాథం...

'ఇప్పుడు కళ్ళుచల్లగా వున్నాయి!'— అంటూ శారదవైపు చూశాడు నరసింహారావు.

'పోనీ లెండి బాబూ!'—అంది యేదో బరువుతగ్గినట్లుగా శారద!...వీధిలో డప్పుల శబ్దం వినిపించింది!

'ఈవేళ కొత్త సినీమా అనుకొంటాను!' —అన్నాడు నరసింహారావు...

'మరి సినీమాపేరు యెత్తితే దవడవాయిస్తాను!'—అంది మృదువుగా శారద!

'మరి నువ్వు యెత్తితేనో?'—అన్నాడు నరసింహారావు...

'బుగ్గ కరిచేద్దురుగాని'—అంది శారద!

రోజులు గడుస్తున్నాయ్. నరసింహారావు హాయిగా, మర్నాటినుంచి ఆఫీసుకెళ్ళటం సాగించాడు.

అయితే యింతవరకూ, నరసింహారావు దవడను శారద వాయించటంగాని, శారద బుగ్గ నరసింహారావు కరవటంగాని జరగలేదు.

★

అంగనరముల బలహీనత పోగొట్టియధా ప్రకారం సంతోష సౌఖ్యముల కలిగించుటకు నపుంసక తైలం రూ. 10/-; వి. పి. రూ/1-

యికమీదట గర్భం రాకుండా ఆపుటకు, లోపలికి సేవించే మందు, గర్భ నిరోధిని 1 సీసా రూ. 10/- వి. పి. 1-0-0.

సిద్ధమకరధ్వజం మాత్రలు—శీఘ్ర స్కలనం తగ్గి, కాళ్లు, నడుమునొప్పులు పోయి, ధాతుపుష్టి కలిగించుటకు సీసా రూ. 10. వి. పి. 1-0-0.

కావలసినవారు రూపాయ పంపేది.

డాక్టర్. రత్నం సన్స్ మెడికల్‌హాల్,
మలకపేట, బిల్డింగ్స్ - హైద్రాబాదు

సిటీ టెక్నికల్ కాలేజి

23/127, ఏలూరు రోడ్డు — విజయవాడ-2.

ఈ సం॥ ప్రారంభం:-16-6-53 పనిచేయు దినములలో ఉ. గం. 10-30 ల నుండి 1 గం. వరకు సా. 2 గం. లనుండి గం. 4-30 ల వరకు ప్రాక్టికల్స్‌తో సహా పనిచేయును.

ఓవర్సీర్-డ్రాఫ్ట్స్‌మన్ కోర్సు :- 10 మా॥ లు. S. S. L. C. గానీ, మెట్రిక్ గానీ చదివి తప్పినను చదువ నర్హులు. గవర్నమెంటు పరీక్షలో ఉత్తీర్ణులైనవారు, గవర్నమెంటులో గానీ, యితర చోట్ల గానీ నెల 1-కి సుమారు రు. 130 లు నుండి 200 వరకు సంపాదించగలరు.

A. M. I. E. కోర్సు :- 3 సం॥ లు. ఇంటరు M. P. C. గ్రూపు ప్యాసయి, 1, 2 పార్టులు తప్పినను చదువ నర్హులు. ప్యాసయినవారు B. E. or B. Sc. ప్యాసయినవారితో ఉద్యోగములకు సమానార్హులు.

ఆంధ్రరాష్ట్రవతరణ తరుపరి ఈ కోర్సులకు ఎక్కువ ప్రాధాన్యత కలదు. ప్రాస్పెక్టస్సు, అడ్మిషను ఫారములకు రు. 1/- M. O. ద్వారా పంపుడు.

ప్రిన్సిపాలు.